క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం ఆమె నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేశారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నగేష్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

అల్లాదుర్గం(మెదక్): గ్రామాల్లో ప్రస్తుత వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో నీటి ఎద్దడిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైన లీకేజీలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ ఫేస్ బోరు మోటార్ల వద్ద, నల్లాలు, వాటర్ ట్యాంకుల వద్ద నీరు వృథా పోకుండా జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ లింగప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించరా?



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వరి కోతలు ప్రారంభమైనందున జిల్లాలో అవసరం ఉన్న చోట్లల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. గతంలో రైతులకు ఇవ్వాల్సిన 500 ఇవ్వడంతో పాటు ఈ సారి అన్ని రకాలకు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరశురాములు, శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.


నార్సింగిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



నార్సింగిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంతో పాటు నర్సంపల్లి, పెద్దతండాలో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ ఆనంద్, తహసీల్దార్ షేక్ కరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే ధాన్యం కాంటా చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీలు సుల్తానా, శంకర్, ఏఈఓ విజృంభణ, కాంగ్రెస్ నాయకులు రాజేష్, యాదగిరి, బాచి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, మాజీ సర్పంచ్‌లు చత్రియా, సత్యం పాల్గొన్నారు.

కొంగోడ్ పీఏసీఎస్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి మృతి



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కృపాకర్ రెడ్డి(77) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపై సంఘం పాలకమండలి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్ సంతాపం తెలిపారు.

లక్ష్యం ఘనం.. నిర్వహణ అధ్వానం



జాతీయ రహదారి పక్కన నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు

నర్సాపూర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి శాశ్వత ఆదాయం కల్పించేందుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి దుకాణాలు(మడిగెలు) వ్యాపారులకు అద్దెకిచ్చారు. వ్యాపారుల నుంచి ప్రతీ నెల అద్దె వసూలులో అధికారులు విఫలం చెందడంతో ప్రభుత్వానికి అద్దె రాక లక్ష్యం నీరుగారుతోంది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలంలో గతంలో 20 షెట్టర్ల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. వాటిని రెండు రకాలుగా విభజించి వ్యాపారులకు అద్దె కిచ్చారు. పంచాయితీరాజ్ ఆఫీసు వైపు నుంచి ఉన్న నాలుగు షెట్టర్లకు నెలకు రూ.8 వేల అద్దె, వాటి పక్క నుంచి ఉన్న 15 దుకాణాలకు నెలకు ఆరు వేల అద్దెతో పాటు మిగిలిన చిన్న షెట్టర్‌కు నెలకు రూ.2 వేలు నిర్ణయించి వ్యాపారులకు అప్పగించారు. కాగా వారిలో ఐదుగురు మినహా చాలా మంది సక్రమంగా అద్దె చెల్లించడం లేదు.

నేతల అండతోనే ..

మండల ప్రజాపరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షెట్టర్లు అద్దెకు తీసుకున్న వారిలో కొందరికి గతంలో రాజకీయ నేతల అండతో వ్యాపారులు అద్దె చెల్లించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

లక్షల్లో షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు

షాపింగ్ కాంప్లెక్స్ షెట్టర్ల అద్దె బకాయిలు లక్షల్లోకి వెళ్లింది. 20 షెట్టర్లలో ఐదారుగురు సక్రమంగా అద్దె చెల్లింస్తుండగా, మిగిలిన వ్యాపారుల నుంచి సుమారు రూ.15లక్షల వరకు ప్రభుత్వానికి అద్దె బకాయిలు రావాల్సి ఉంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు అద్దె వసూలు చేసేందుకు ప్రభుత్వ నిబంధనలను సరిగా అమలు చేయనందునే అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయని విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వానికి నెల నెల ఆదాయం రాకుండా పోవడం గమనార్హం.

చర్యలు తీసుకుంటున్నాం

ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు అద్దె వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ నెల మొదటి వారంలో తమ సిబ్బందిని వ్యాపారుల వద్దకు పంపి, అద్దె వసూలు చేయిస్తున్నాం. మొండిగా వ్యవహరిస్తున్న వారి నుంచి సైతం పూర్తి స్థాయిలో అద్దె వసూలుకు చర్యలు తీసుకుంటాం.
– ఎంపీడీఓ మధులత

భూములకు పట్టాలివ్వండి



నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న కొంగోడు రైతులు

నర్సాపూర్: భూములకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని కొల్చారం మండలం కొంగోడుకి చెందిన రైతులు బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాము 70 ఏళ్లుగా గ్రామంలోని 209 సర్వే నంబర్ భూమిలో 93 ఎకరాల 13 గుంటల భూమిలో 110 మంది రైతులం కబ్జాలో ఉన్నా.. తమకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2012లో సర్వే చేసి, పాస్‌పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఇంత వరకు ఇవ్వలేదని ఆరోపించారు. వాస్తవ పరిస్థితులను గుర్తించి కబ్జాలో ఉండి సాగు చేస్తున్న తమకు పట్టాలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డీఓ మహిపాల్‌కు వినతి పత్రం అందజేయగా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



శివ్వంపేటలో పశువులకు వేస్తున్న టీకాలను పరిశీలిస్తున్న వెంకటయ్య

శివ్వంపేట(నర్సాపూర్): పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, వాటికి సోకే వ్యాధులపై రైతులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రం శివ్వంపేట, చెన్నాపూర్‌లో పశువులకు వేస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి మే 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మూగజీవాలు అనారోగ్యానికి గురైతే నాటువైద్యం చేయకుండా, పశు వైద్యులకు చూయించి వైద్యం చేయించాలన్నారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు సంధ్యారాణి, ప్రియాంక, కీర్తి, గోపాల మిత్రలు గోపాల్, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): పశువుల్లో గాలికుంటు వ్యాధులు సోకకుండా మండలంలో ఈ నెల 16 నుంచి మే 14 వరకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డా. రేఖరసజ్ఞ అన్నారు. అందులో భాగంగానే బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలో ప్రారంభించారు. పాడి రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. మండలంలో సుమారు 7,332 పశువులు ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ ఆఫీసర్ ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రపథకాలపై అవగాహన



అజ్జమర్రి అంగన్‌వాడీ ఆవరణలో పరిసరాలు శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చలో గావ్, చలో బస్తీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ హాజరయ్యారు. ఇందులో భాగంగా బీజేపీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణను శుభ్రం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ఆహర పదార్థాల గురించి ఆరా తీశారు. అనంతరం కరోనా నాటి నుంచి ఇప్పటివరకు గరీబ్ కల్యాణ్ పేరుతో పేదలకు ఇస్తున్న బియ్యం, ఆయుష్మాన్ భవ పథకం, గ్రామాల్లో వేస్తున్న ఈజీఎస్ రోడ్లు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులేనని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నాగేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, నాయకులు రాజు, దశరథ్, బాబు, అనిల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 1883 దరఖాస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి రుణాల కోసం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1883 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారిలో ఇప్పటివరకు 1358 మంది ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారని చెప్పారు. ఇందులో బీసీ 833, ఎస్సీ 172, ఎస్టీ 301, మైనార్టీ 43, ఈబీసీ 8, దివ్యాంగులు 1 దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

జెడ్పీపాఠశాలను ప్రారంభించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఠల్

మెదక్ కలెక్టరేట్: తమ గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో వసతులు కల్పించి పునః ప్రారంభించాలని మండలంలోని గౌతపూర్ గ్రామ మాజీ సర్పంచ్ స్వరూప భర్త విఠల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈఓ రాధాకిషన్‌లను ఆయన కలిసి పాఠశాలను ప్రారంభించడంతో పాటు గ్రామ గేటు వద్ద బస్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం విఠల్ మాట్లాడుతూ.. గ్రామంలో శిథిలావస్థకు చేరిన జెడ్పీ పాఠశాలలో మరమ్మతులు పూర్తయ్యాయని, ఇంకా నీటి వసతి, ఫర్నిచర్ వసతి కల్పించాల్సి ఉందని తెలిపారు. ఆ పనులు వెంటనే పూర్తిచేసి ఈ విద్యా సంవత్సరంలోనే పాఠశాలను ప్రారంభించాలని కోరారు.

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయండి



చిన్నశంకరంపేట(మెదక్): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని నార్సింగి మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలారం బాబు, భూపతిరాజు కోరారు. ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా

హవేళిఘణాపూర్(మెదక్): గర్భిణులు, పిల్లలకు మంచి ఆరోగ్యం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా అన్నారు. బుధవారం మెదక్ మండలం రాయిన్‌పల్లిలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారుల బరువు, ఎత్తు, గర్భిణులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వేదావతి, అంగన్‌వాడీ టీచర్లు జయశీల, సుమతి, ఆయా పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ, రెవెన్యూ, ఐకేపీ, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఐకేపీ ఆధ్వరయలో-07, పీఏసీఎస్ ఆధ్వర్యంలో-06 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ కేంద్రంలో గన్నీ బ్యాగులతో పాటు రైతులకు తాగునీరు, ఎండ తీవ్రత తట్టుకునేలా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం రైస్‌మిల్లర్లకు చేరాలని సూచించారు. ఈ సమీక్షలో తహసీల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి గంగుమల్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉంటే చెప్పండి

ఎంపీడీఓ శ్రీనివాస్



కౌడిపల్లిలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు, తండాల్లో తాగు నీటి సమస్య ఉంటే చెప్పాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ కలీముల్ల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సందర్భంగా ప్రభుత్వం గ్రామాల్లో నీటి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సమస్య ఉంటే తెలియజేయాలని, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ప్రతీరోజు మంచినీళ్లు వస్తున్నాయా లేదా రెండు రోజులకు ఒకసారి వస్తున్నాయా, అసలు రావడం లేదా ఇతర నీటి సమస్యలుంటే చెప్పాలని తెలిపారు. వననర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండాలని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకునే చర్యలపై తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ, పలు హోటళ్ల వద్ద, ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీశైలం మాట్లాడుతూ.. ప్రజలు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు అగ్నిమాపక సేవలను వినియోగించుకోవాలని, అత్యవసర సమయాల్లో 101కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మ, బంగారయ్య, రాజశేఖర్, సాయికిరణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

తూకం ఎప్పుడు?



రంగంపేట పీఏసీఎస్ ఆవరణలో తూకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

కొల్చారం(నర్సాపూర్): ఇప్పటికే వరి కోతలు కోసి, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిస్థాయిలో తూకానికి వచ్చింది. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా.. గ్రామాల్లో ఎక్కడా తూకం ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా సగానికి పైగా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, గాలి దుమారంతో మధ్య మధ్యలో వస్తున్న వర్షం చినుకులతో రైతుల్లో ఆందోళన పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ఉన్న హడావిడి, ధాన్యం తూకం వేయడంతో లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం తూకం ప్రారంభమయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



మల్కాపూర్‌లో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను నూతన ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మల్కాపూర్, బూర్గుపల్లి, బద్దారం, కమలాపూర్ తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఫార్మేషన్ రోడ్డు పనులు, ఫిష్‌పాండ్ పనులుతో పాటు నర్సరీలను ఆయన పరిశీలించారు. కూలీలు పనులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం కూలీల హాజరుశాతాన్ని పరిశీలించి, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గర్భాలయానికి ఇత్తడి తొడుగులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి గర్భాలయానికి ఇత్తడి తొడుగుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. హైదరాబాదుకు చెందిన దాత జయలక్ష్మీ సహకారంతో సుమారు రూ.లక్ష నిధులతో కోనేరు పక్కనున్న లక్ష్మీనర్సింహస్వామి గర్భాలయానికి ఇత్తడి తొడుగుల చేపడుతున్నట్లు అలయ ఈఓ శశిధర్, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ బుధవారం తెలిపారు.

◆ నీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

చేగుంట(తూప్రాన్): వేసవి సందర్భంగా నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం చేగుంట ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రెండు నెలల పాటు నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక చొరవను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

◆ భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ బోనాలు



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమ్మ దేవతకు బోనాలు తీశారు. మహిళలు బోనమెత్తి గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. వందలాది భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చారు. గురువారం బేతాళ స్వామికి బోనాలు తీయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

◆ 15వ విడత సామాజిక తనిఖీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో జాతీయ ఉపాధిహమి పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. 01-04-2024 నుంచి 31-03-2025 వరకు మండలంలో ఈజీఎస్ ద్వారా చేసిన పనులను బృందం సామజిక తనిఖీ చేస్తారని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఏపీఓ అనీల్‌కుమార్ చెప్పారు. కూలీలకు సంబంధించి 6 కోట్ల 78 లక్షల పనులు నిర్వహించగా, మెటీరియల్‌కు సంబంధించి 3 కోట్ల 53 లక్షల పనులు జరిగాయని చెప్పారు.

◆ కాంగ్రెస్‌లో చేరిన వడియారం నాయకులు



చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌గౌడ్‌తో పాటు యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉసామొద్దీన్, శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

◆ చలివేంద్రం ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కోనాయపల్లి(పీటి) ప్రధాన చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుడు కల్యాణ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీటీ కౌశిక, నాయకులు రేణుకుమార్, శ్రీనివాస్‌గుప్తా, నత్తి మల్లేశ్, సుధాకర్, మురళి, విశాల్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు నర్సింలు తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం వినియోగించుకోవాలని నర్సింలు కోరారు.